## సమ్మోహనాస్త్రం

తన గది కిటికీలో నుంచి ఎదురింటి మేడ గదికేసి చూస్తోంది మాల. ఆరోజు ఉదయమే అందులో చేరాడు నిశాంత్. లోపల ఏదో సర్దుకొంటున్నాడేమో దాదాపు 5-30 గం.ల. దాకా బైటికే రాలేదు. గది బైటకు వచ్చి ఓసారి ఎదురింటికేసి చూశాడు. కిటికీలో మెరుపు మెరిసినట్లుగా ఓరచూపు చూస్తున్న ఓ లలన అతని మనసును బంధించింది. రెప్పలు టపటపలాడిస్తూ సమ్మోహనంగా అతన్నే చూస్తోంది ఆమె.

'అబ్బా ఎంత అదృష్టం! అందమైన గది, ఎదురుగా మనసుకు కళ్ళెం వేసే కళ్ళతో మురిపించే చెలి, ఇంతకంటే ఏం కావాలి?' హుషారుగా ఈల వేసుకుంటూ మళ్ళీ గది లోపలికెళ్ళి అద్దం ముందు నిలబడి మరింత చక్కగా టాయ్‌లెట్ అయి, తలుపు దగ్గర నిలబడ్డాడు. బాగా చీకటి పడేవరకూ చూపుల రాయబారం నిరాటంకంగా సాగింది. మధ్య మధ్యలో పెదవులు విడీ విడనట్లు సన్నటి చిరునవ్వుల మధ్య పూర్తిగా మనసు దోచేసుకొందా అమ్మాయి.

ఆ రాత్రి తీయని కలలతో కలత నిద్ర చెంది ఉదయం త్వరగా లేచి బైటికొచ్చి చూశాడు. కిటికీ తలుపులు మూసివున్నాయి. తను కాలేజీకి బయలుదేరేంత వరకూ చూశాడు. 'ఉహూ లాభం లేదు' అనుకొంటూ కాలేజీకెళ్ళాడు. తన ప్రాణ స్నేహితునితో విషయం అంతా చెప్పి, 'ఎలాగైనా సరే ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకొంటాను' అంటూ అతన్ని కూడా లాక్కొచ్చాడు రూమ్‌కు. మళ్ళీ సాయంత్రం 5 గంటలయ్యేసరికి కిటికీ తలుపుల వద్ద ప్రత్యక్షమయ్యాయి ఆ కళ్ళు. నిశాంత్ స్నేహితుడు కూడా ఈ తతంగమంతా చూసి 'తంతే బూరెల గంపలో పడ్డట్టుందిరా నీ పని' అంటూ అభినందించి వెళ్ళాడు.

ఇలా ఓ వారం గడిచింది. మాటా, పలుకూ లేకుండా ఇదేమిటనుకొంటూ ధైర్యం చేసి ఓ ఉత్తరం వ్రాసి ప్రక్కింటి పిల్లవానితో ఇచ్చి పంపాడు నిశాంత్. అది ఆ అమ్మాయి తండ్రి చేతిలో పడి, ఆయన ఆ ఉత్తరంతోపాటు నిశాంత్ రూమ్‌కు వచ్చాడు. "చూడు బాబూ, నీకు మా అమ్మాయి సంగతి తెలీదు లాగుంది. దానికి మతి స్థిమితం లేదు. అది ఒకప్పుడు ఈ మేడ మీద వున్న అబ్బాయినే ప్రేమించింది. అతను ఆక్సిడెంట్‌లో చనిపోయాడు. అప్పట్నుంచీ ఇలా వుంది దాని పరిస్థితి. ఎన్ని మందులు ఇప్పించినా ప్రయోజనం కనిపించలేదు ఈ కిటికీ వదలదు. చూపంతా ఇక్కడే వుంటుంది. ముసలోడున్నా సరే ఇక్కడ, ఇలాగే చూస్తుంది" అన్నాడు. అంతే! నిశాంత్ మనసు మొద్దుబారిపోయింది.

—ఎం.సువర్ణ

# కాలం దాటని కథలు

## పాపం! పింకీ!!

ఆఫీసు నుంచి వచ్చి వంటపని కానిచ్చి, మొక్కల మధ్య కుర్చీలో మేను వాల్చింది శాంతి అమ్మయ్య అనుకుంటూ. అలసిన శరీరానికి చల్లని గాలి తగులుతుంటే ఎంతో హాయిగా అనిపించింది. ఆ సుఖాన్ని అనుభవించనీయకుండా చెవుల్లో గింగురుమంటూ పింకీ అరుపు మొదలుపెట్టింది. కర్ణభేరి తెగిపోతుందేమో ననిపించింది శాంతికి. అసలే కుక్క అంటే ఎలర్జీ శాంతికి. దాని అరుపంటే మరింత ఎలర్జీ. వద్దు మొర్రో అంటే తెచ్చి నెత్తి కెక్కించాడని భర్తని కసిగా తిట్టుకొని, "నోర్ముయ్, ఎందుకలా అరుస్తావ్?" అంటూ బెదిరించింది. వెధవ గోల కాస్సేపు విశ్రాంతి తీసుకుందామంటే లేదు-కుర్చీలో కూలబడింది. పింకీ ఇంకా గట్టిగా అరవడం మొదలుపెట్టింది. విరామం లేకుండా భంగు భంగుమని అరుస్తుంటే చిరాకెత్తి పోయింది శాంతికి. రూళ్ళకర్ర తెచ్చి రెండు వడ్డించింది. అయినా పింకీ ఊరుకోలేదు. ఇంకా కంగారుగా గింజుకుంటూ గట్టిగా అరుస్తోంది. శాంతికి తిక్క రేగినట్టుందేమో సహనం కోల్పోయింది. కూర్చోబోయేదల్లా మళ్ళీ వచ్చి, "చెప్తుంటే వినపడడం లేదూ" అని పింకీని చావబాదడం మొదలుపెట్టింది. అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన సుబ్బారావు కంగారుగా "ఏమిటి శాంతీ? ఏమిటి? ఎందుకు దాన్నలా చావబాదుతున్నావు? అదేమన్నా బ్రతుకుతుందా!" అని భార్య చేతిలో కర్ర లాక్కున్నాడు. అన్ని దెబ్బలు తిన్నా పింకీ సుబ్బారావును చూసి తోక ఆడిస్తూనే అరుస్తోంది. శాంతి వైపు చూస్తూ ఊరికే హడావిడి పడిపోతోంది. సుబ్బారావుకి పింకీ కంగారు, దాని చూపులు చూస్తే ఏదో స్ఫురించింది. పింకీ చూసే వైపే తనూ అనుమానంగా చూశాడు. అతని దృష్టికి కుర్చీ క్రింద పాకుతున్న తేలు కనపడింది. "శాంతీ తేలు!" అనడంతోటే వెళ్ళి కుర్చీలో కూర్చోబోతున్న శాంతి ఠక్కున ఆగిపోయింది. కొండెం ఎత్తిపెట్టి కాటేయడానికి సిద్ధంగా వున్న నల్లతేలును చూడగానే అప్రయత్నంగా చేతులు గుండెలమీదకి పోయాయి శాంతికి. నా డ్యూటీ అయిపోయిందన్నట్టు అరవడం ఆపేసి అలసిపోయిన దానిలా పడుకుండిపోయిన పింకీని ఒకే క్షణంలో చూసిన శాంతి, సుబ్బారావులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. పిల్లలు లేక పింకీనే బిడ్డలా చూసుకుంటున్న సుబ్బారావు కళ్ళల్లో నీళ్ళు చూసి శాంతి తల వంచుకుంది.

—మొగలి పద్మజ

## గయుడు

"నమస్తే అంకుల్..." అంటూ వచ్చాడు శ్రీధర్.

"రావోయ్! రా!..." అంటూ ఆప్యాయంగా ఆహ్వానించేరు రంగనాథం.

రంగనాథంగారు శ్రీధర్ తండ్రికి స్నేహితుడు. శ్రీధర్ ఎం.టెక్. చేసి రీసెర్చి చేస్తున్నాడు.

"నీ థీసిస్ గైడ్ పురుషోత్తం కదూ?" అడిగేరు రంగనాథం.

"అవును సార్! ఆయన మీ స్నేహితుడే కదూ! నాలుగు రోజుల క్రితం ఆయన్ని కలుసుకుందుకు వెళ్ళినప్పుడు మీరు ఆయన దగ్గరే వున్నారు..." అంటూ గుర్తుచేశాడు శ్రీధర్.

ఆ విషయం గుర్తు వచ్చింది రంగనాథంకి. ఆరోజు శ్రీధర్ తన థీసిస్ గైడ్‌ని కొన్ని ప్రశ్నలు కూడా అడిగేడు.

"శ్రీధర్! ఆరోజు నువ్వు పురుషోత్తంగారిని కొన్ని ప్రశ్నలు అడిగేవు గుర్తుందా? అవన్నీ చాలా చిన్న ప్రశ్నలు. అవి నీకు తెలియకపోవడం నాకు ఆశ్చర్యం కలిగించింది. బి.ఇ.చదువుతున్న వాళ్ళకు తెలుసు ఆ జవాబులు. కానీ నీకు తెలియదనడం..." అర్థోక్తిలో ఆగిపోయారు రంగనాథం.

"వాటికి జవాబులు తెలుసు సార్... అయినా



ఆయన్ని అడిగేను..."

"ఎందుకని?"

"గైడ్స్‌కి ఎప్పుడూ అన్నీ తమకే తెలుసుననీ, తమ విద్యార్థులు చవటలనీ, తాము కనుక నెగ్గుకు వస్తున్నామనీ అనే ఒక జబ్బు వుంది. వాళ్ళు బోధించబోయే విషయం మనకు తెలుసునంటే బాధపడిపోతారు. 'నాకేమీ తెలియదు, అన్నీ మీరే చెప్పాలి..' అన్న ధోరణిలో ప్రయత్నిస్తే వాళ్ళకు సంతోషం. అందుకే జవాబులు తెలిసినా అలా అడిగాను.." అన్నాడు శ్రీధర్.

ఆశ్చర్యంగా చూశారు రంగనాథంగారు.

"'చాలామందికి ఈ ప్రశ్నకు జవాబు తెలియదోయ్! నీకు తెలుసేమో చెప్పు..' అంటూ ఆయన ఒక ప్రశ్న అడిగేరు. దానికి జవాబు తెలిసినా చాలామందికి తెలియదన్న ఆయన నమ్మకం నమ్ము చెయ్యకూడదు కనుక నేను తెలియదన్నాను.." అన్నాడు శ్రీధర్. మెచ్చుకోలుగా చూశారు రంగనాథం శ్రీధర్ వంక.

—పాలకూర సీతాలత